సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

రైతన్నకు నష్టాలే..

- నకిలీ విత్తనాలు ఓ వైపు..అకాల వర్షాలు మరోవైపు
- రైతులను ఆదుకోవాలని నేడు సిపిఎం ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ప్రతి ఏడాదీ రైతులు ఏదో ఒక రూపంలో నష్టపోతూనే ఉన్నారు. నకిలీ విత్తనాలు ఓ వైపు...అకాల వర్షాలు మరోవైపు రైతులకు నష్టాలను తెచ్చి పెట్టాయి. దేశానికి రైతే వెన్నెముక, రైతే రాజు అంటూ చెప్పడం తప్ప రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదు. ఈ ఏడాది కూడా నకిలీ విత్తనాలు, అకాల వర్షాల వల్ల జిల్లాలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టనున్నారు...

నకిలీ విత్తనాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని ఆదోనిలో ధర్నా చేపడుతున్న రైతులు (ఫైల్)

గతేడాది లాగా ఈ ఏడాది కూడా నకిలీ పత్తి విత్తనాలు రైతులకు నష్టాలను మిగిల్చాయి. గతేడాది అత్యధికంగా క్వింటా పత్తి రూ.12,500 వరకూ పలికింది. దీంతో, ఈ ఏడాది పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. కర్నూలు జిల్లాలో పత్తి సాధారణ సాగు 6.11 లక్షల ఎకరాలు కాగా సాధారణ సాగుకు మించి 6.46 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. కర్నూలు డివిజన్‌లో 1.02 లక్షల ఎకరాల్లో, ఆదోని డివిజన్‌లో 1.40 లక్షలు, ఎమ్మిగనూరు డివిజన్‌లో 1.29 లక్షలు, ఆలూరు డివిజన్‌లో 1.35 లక్షలు, పత్తికొండ డివిజన్‌లో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నకిలీ విత్తనాల దాటికి 5 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టపోయింది. సూపర్ కాటన్, జంగి, ఆదిత్య, అభిర, తడాకా, సూపర్, వింధ్య, లయన్, స్టాలిన్, 3228, కిలాడీ, 429 సూర్య, బిగ్‌బాస్, రాధిక, బిజి 2 వంటి 30 రకాల కంపెనీల విత్తనాలను కొని పంట దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయారు. కోట్లల్లో రైతుల పెట్టుబడి మట్టిపాలైంది. నకిలీ పత్తి విత్తనాల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు పలు దఫాలుగా ఆందోళనలు నిర్వహించారు.

అక్టోబర్ తొలి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో వర్షాలు కురిసాయి. కర్నూలు జిల్లాలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి. ఈ అకాల వర్షం దెబ్బ పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు వాన దెబ్బకు పొలంలోనే కుళ్లిపోయాయి. జిల్లాలో ఖరీఫ్‌లో 19,655 ఎకరాల్లో వరి, జొన్న 95 ఎకరాల్లో, మొక్కజొన్న 8,325, కంది 48,034, వేరుశనగ 1,76,295, ప్రొద్దుతిరుగుడు 1,785, పత్తి 5,81,997, మిరప 30,472 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా 12,522 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అక్టోబర్ 1న ఒక్క రోజు కురిసిన భారీ వర్షానికి 4,465 ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. అక్టోబర్ 6న తుంగభద్రకు పెద్దఎత్తున వరద నీరు పోటెత్తడంతో 4,366 ఎకరాల్లో వివిధ పంటలు నీట మునిగాయి. ఎక్కువగా పత్తి 2,737 ఎకరాల్లో, వరి 370 ఎకరాల్లో, మిరప 524 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పంట నష్టం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులను మాండూస్ తుపాను వణికిస్తోంది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుం డటంతో పంటలు దెబ్బతింటున్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడటంతో తడిసి ముద్దయింది. కళ్ల ముందే దిగుబడులు తడిసిపోవడంతో పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 6,74,864 ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తైంది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధ మవుతున్న సమయంలో వర్షం పడటంతో తడిసి పనికిరాకుండా పోతోంది. ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దిగుబడులపై ప్రభావం పడుతుంది. కాయలు తెల్లగా మారిపోయే ప్రమాదముంది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. రబీ సీజన్లో నవంబరు రెండో వారం నుంచి జిల్లాలో మొక్క జొన్న సాగు మొదలైంది. కొందరు తొలివారంలో విత్తనాలు నాటారు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో నీరు నిలిస్తే మొక్కలు చనిపోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన వరి పంట కోత కోసుకోలేక, కోసిన వరి ధాన్యం కల్లాల్లో ఉండి తడవకుండా పట్టాలు కప్పుకుంటూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నాలు నిర్వహించనున్నారు. కర్నూలు కలెక్టరేట్, ఆదోని, పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద, ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించనున్నారు. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కమిటీ పిలుపునిచ్చారు.

సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు
- ఆదోనిలో అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా బలోపేతం చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు తహశీల్దార్, ఎంపిడిఒలను ఆదేశించారు. బుధవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు, తహశీల్దార్లు, ఎంపిడిఒల బాధ్యతలు, విద్యా శాఖ పని తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గతంలో ప్రజలు పనులు మానుకుని మండలాలకు వెళ్లేవారని, ఆ సమయంలో అధికారులు దొరకక ఇబ్బందులు పడేవారని తెలిపారు. వాటిని అధిగమించి ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామస్థాయిలో ప్రతి పనీ సచివాలయం ద్వారానే జరుగుతుందని, సచివాలయాలను బలోపేతం చేసుకోకపోతే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు లభించవని తెలిపారు. సచివాలయ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వీరితో ఎందుకు పని చేయించడం లేదని తహశీల్దార్, ఎంపిడిఒలను ప్రశ్నించారు. ఇంటి స్థలం, ఇల్లు, కుల ధ్రువీకరణ పత్రం ఇలా ఏది కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అందుకు సంబంధించి 90 శాతం పని సచివాలయాల్లోనే జరుగుతోందని చెప్పారు. రెవెన్యూ, ఇతర అంశాలపై తహశీల్దార్, ఎంపిడిఒలు సచివాలయాలకు వెళ్లి అవగాహన కల్పించకపోతే పనులు సక్రమంగా జరగవని తెలిపారు. ఎపి సర్వీసులన్నీ మీసేవ ద్వారానే జరుగుతున్నాయని, మీసేవలాగా సచివాలయ ఉద్యోగులు స్పందించకపోవడం, వేగంగా చేయకపోవడమే కారణమని చెప్పారు. ఇకపై సచివాలయాల్లో సర్వీసులు పెరగాలని, లేకపోతే సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సక్రమంగా స్పందించడం లేదని భావిస్తామని తెలిపారు. ఇందుకు తహశీల్దార్లు, ఎంపిడిఒలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. 15 రోజుల్లోపు సేవలు పెరిగేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. సేవలు పెరగని చోట చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను ఆదేశించారు. ప్రతి సచివాలయాన్నీ వారంలో ఒకసారి తనిఖీ చేసి, సేవలు ఎలా అందిస్తున్నారని పర్యవేక్షించాలని సూచించారు. అధిక రక్తహీనత జోన్‌గా ఆదోని మండలం ఉందని, రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్‌ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు.

ఫెయిల్ కాకూడదు

ఈఏడాది పదో తరగతి పరీక్షల్లో ఒక్క పిల్లవాడు కూడా ఫెయిల్ కాకూడదని విద్యా శాఖాధికారులను ఆదేశించారు. అది కూడా తప్పుడు మార్గాల ద్వారా కాదని, పిల్లలు బాగా చదువుకుని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. పిల్లలు ఫెయిల్ అయితే పత్తి, మిరప తోటలకు పనికి వెళ్తారని, ఆ పరిస్థితి రాకుండా వారు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు చదివేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ... సచివాలయాల పనితీరు, సేవలు అందిస్తున్న తీరు, తహశీల్దార్, ఎంపిడిఒల బాధ్యతలు, విద్యాశాఖలో పర్యవేక్షణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సర్వశిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిఆర్‌డిఎ పీడీ సుబ్బయ్య, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం వినతి

పట్టణంలో శ్రీనివాస్ భవన్ నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ వరకు ప్రమాదకరంగా ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. భారీ వాహనాల రాకపోకల వల్ల బ్రిడ్జి పైకప్పు పెచ్చులూడి పడిపోతున్నాయని, వాహనదారులు గాయాల పాలవుతున్నారని వాపోయారు. పరిశీలించి వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. బ్రిడ్జి ఇరువైపులా సైడ్ వాల్స్ పడిపోయినప్పుడు మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. నాయకులు తిప్పన, వీరేష్, శ్రీనివాసులు, తిక్కప్ప పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మార్చి చివరి వరకు నీరందించాలి

- హంద్రీనీవా ఎస్ఇకి సిపిఎం వినతి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

హంద్రీనీవా కింద రైతులు వేసిన పంటలకు మార్చి నెల చివరి వరకు సాగునీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హంద్రీనీవా ఎస్ఇ రామగోపాల్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా కింద జిల్లాలో క్రిష్ణగిరి, తుగ్గలి, పత్తికొండ, దేవనకొండ మండలాల్లో రైతులు 40 వేల ఎకరాల్లో రబీలో పంట వేశారని, ఇప్పుడు హంద్రీనీవా అధికారులు మార్చి చివరి వరకు సాగునీరు అందించలేమని చెప్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో అధిక వర్షాలు రావడం, తెగుళ్ల రావడం, నకిలీ విత్తనాల వల్ల వేసిన పంటలు చేతికి రాక అప్పులతో విలవిలలాడుతున్న రైతులకు రబీలో అయినా పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఎస్ఇను కోరారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో ఉన్న రైతులను ఆదుకోవడానికి సాగునీరు నిల్వ చేసుకోవాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో ఉన్న మంత్రులు కూడా తమ క్యాబినెట్‌లో హంద్రీనీవా ద్వారా మార్చి చివరి వరకు రబీలో సాగునీరు అందించేలా కృషి చేయాలన్నారు. ఆ రకంగా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి రైతుల సమస్యలపై, మార్చి చివరి వరకు సాగునీరు అందించేలా పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు మాత్రమే రైతుల మంచి చెడ్డల గురించి ఆలోచించే ప్రజా ప్రతినిధులు ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు రబీలోనైనా సాగునీరు అందించి ఆదుకోవడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పటికే ఖరీఫ్‌లో బిల్లుల నెపంతో హంద్రీనీవా కింద పలుసార్లు నీళ్ల నిలిపివేశారని రబీలో అయిన పంటలకు నీళ్ల ఇవ్వాలని కోరారు.

ఎస్ఇకి వినతి అందిస్తున్న గౌస్ దేశాయ్, నారాయణ

37వ వార్డులో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

రాష్ట్రంలో అసమర్ధ పాలన కొనసాగుతోంది

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అసమర్ధ పాలన కొనసాగుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో తరిమికొడదామని టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 37వ వార్డ్ వీకర్ సెక్షన్ కాలనీలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గౌరు చరితతో పాటు స్థానిక టిడిపి నాయకులు కాలనీలో ఇంటింటికీ తిరిగి జగన్ రెడ్డి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, 37వ వార్డ్ ఇంచార్జి కృష్ణవేణమ్మ, అర్బన్ వార్డ్ నాయకులు జనార్ధన్ ఆచారి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, నాయకులు నాగేశ్వర రావు, వార్డ్ కార్యకర్తలు రాముడు, కుంచల మధు, శివ తేజ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటలి

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

ఈ నెల 17 నుంచి 18 వరకు జరుగుతున్న 9వ రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని జిల్లా టెన్నిస్ వాలీబాల్ సంఘం అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లా టెన్నిస్ వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో మినీ, యూత్, సీనియర్స్ విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు ముందుండి రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ వాలీబాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, సభ్యులు నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గంగాధర్, నాగ శేషు, నాగన్న, సాంబ, నాగేశ్వరి, మాధవి, దేవి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో బాలికల ప్రతిభ

ప్రజాశక్తి - సి.బెళగల్

బెళగల్‌ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ బుధవారం సైన్స్ ఫెయిర్ ప్రోగ్రాం నిర్వహించగా బాలికలు ప్రతిభను చాటారు. పలు రకాల ప్రయోగాలు ప్రదర్శించి ఉపాధ్యాయులతో మెప్పు పొందారు. విద్యార్థులు సైన్స్ రంగంలో రాణించాలని పలువురు పేర్కొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు కుట్ర : ఆవాజ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం, సిక్, జైన్, దళిత, మైనారిటీల సంక్షేమ పథకాలు ఒక్కక్కటి రద్దు చేస్తూ వస్తున్న బిజెపి ప్రభుత్వం ఇటీవల మెరిట్ స్కాలర్‌షిప్‌లను రద్దు చేసి మైనార్టీ విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్ విమర్శించారు. గురువారం స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో నగర అధ్యక్షులు ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్కాలర్‌షిప్‌లను రద్దు చేసిందని, మైనార్టీ విద్యార్థులు కనీసం చదువుకునే అవకాశాలు లేకుండా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.మైనార్టీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్లను, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ స్కాలర్షిప్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. దళిత, ముస్లిం మైనార్టీలకు రోజుకు ఒక పథకం తీసేస్తూ వారి అభివృద్ధికి ఆటంకంగా బిజెపి ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. ముస్లిం, దళిత, సిక్కులు, జైన్స్, అణగారిన కుల మతాల వారు అందరూ కలిసి బిజెపిపై పోరాటలకు సిద్దంగా ఉండాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎపిలో బిజెపి ప్రభుత్వం దళిత మైనార్టీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాల్సిన వైసిపి, టిడిపి, జనసేనలు మౌనంగా వుంటూ పరోక్షంగా మద్దతు ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. వైసిపి అధికార పక్షం నోరు విప్పదని, టిడిపి ప్రతిపక్షం చూస్తూ ఉంటుందని, జనసేన వెయిట్ చేస్తుందన్నట్టుగా ఈ మూడు పార్టీల వ్యవహారం ఉందని విమర్శించారు. బిజెపి ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయలసీమ ప్యాకేజీ వంటివన్నీ ఇచ్చేది లేదని చెప్పినా ఈ మూడు పార్టీల శైలి చచ్చిన జీవశవంలా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర అభివృద్ధి కోసం ఈ మూడు పార్టీలు మాట్లాడకపోవడం విచారకరమఅన్నారు. తక్షణమే మైనార్టీలకు మెరిట్ స్కాలర్షిప్‌లను, మౌలానా ఆజాద్ స్కాలర్షిప్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఇంతియాజ్, మహమ్మద్ షరీఫ్, అబ్దుల్, నయీమ్, చోటు భాయ్, ఇలియాజ్, చాంద్ బాషా, ఫయాజుల్ కరీం, అబ్దుల్, రహమాన్, మాలిక్, శాలి భాష, నూర్ వల్లి, సలీం భాష, అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇక్బాల్ హుసేసన్

టి.చంద్రుడు ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కార్మిక వర్గ సమస్యలపై చివరి శ్వాస వరకు పరితపించి పని చేసిన టి చంద్రుడు ఆశయాలను ముందుకు తీసుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక కార్మిక కర్షక భవన్లో టి.చంద్రుడు 5వ వర్ధంతి సభ సీనియర్ నాయకులు ఎం.గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కాలరాసి కార్పొరేట్ శక్తులు యదేచ్ఛగా దోచుకొని శతకోటీశ్వర్లు కావడానికి అన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. మరో పక్క యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వాళ్లకు కారు చౌకగా కట్టబెడుతున్నారన్నారు. లక్షల సంఖ్యలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే చంద్రుడుకు నిజమైన నివాళు లర్పించినట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు న్యూ సిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, నగర నాయకులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళ్లులర్పిస్తున్న నాయకులు

కలుగొట్ల గ్రామ పంచాయతీకి తాళం వేసిన వారిపై

అట్రాసిటి కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దళితుడైన మద్దిలేటి సర్పంచి కావడంతో భరించలేని ఆధిపత్య వర్గాలు ఏకంగా పంచాయతీ కార్యాలయానికే తాళాలు వేసి అవమానించారని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెల్దుర్తి మండలం, కలుగొట్ల గ్రామంలో పంచాయతీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుండి ఆధిపత్య వర్గాల పెత్తనం కింద ఏకగ్రీవం పేరుతో అజమాయిషీ చలాయిస్తూ వచ్చిన పెత్తందారులకు, రిజర్వేషన్ ద్వారా దళితుడు సర్పంచి కావడం కంటగింపుగా మారిందన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన దళిత సర్పంచి మద్దిలేటిని పంచాయతీ కార్యాలయంలో కూర్చోనివ్వకుండా ఏకంగా కార్యాలయానికి తాళాలు వేయడమనేది దళితుడు పాలనకు పనికిరాడన్న వివక్ష తప్ప వేరే కాదన్నారు. సర్పంచి చేసిన పనులకు సైతం నిధులను ఆపడమనేది అధికారిక వివక్షగా భావించాలా, లేక అధికారులు ఆధిపత్య వర్గాలకు గులాములుగా వుంటున్నారనుకోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు తాళాలు వేసిన ఆధిపత్య వర్గాలను వెంటనే అరెస్టు చేయాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా దృష్టి పెట్టాలని, లేదంటే కలుగొట్ల సర్పంచి మద్దిలేటికి మద్దతుగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రజలతో కలిసి టీ తాగుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వైసిపి ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలన్నీ చేర్చుతున్నామని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం జోహరాపురం 18వ వార్డ్ 43వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమన్నారు. ప్రతి పక్ష పార్టీల వారి లాగా జన్మభూమి కమిటీలను పెట్టి వారికి అనుకూలమైన వారికి మాత్రమే మొఖాలను చూసి ఫించన్, ఇతర ప్రభుత్వ నుండి వచ్చే లబ్దిని ఇచ్చే పద్ధతులు ఇప్పుడు లేవన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో అన్యాయంగా ప్రజల సొమ్మును తెలుగుదేశం పార్టీ నాయకులకి దోచిపెట్టారని ఆరోపించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో శాసనసభ్యుల దృష్టికి వచ్చిన సమస్యలని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖా అధికారులని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలతో కలిసి స్థానిక టీ కొట్టు దగ్గర టీ తాగడం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పల్లవి, వార్డు నాయకులు మల్లికార్జున, చిన్నబాబు, మహిళా నాయకురాలు చెన్నమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు పెండెకల్ ఆర్ఎస్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - తుగ్గలి

గత వారం రోజులుగా కర్నూలులో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా జట్ల ఎంపికలో ఆర్ఎస్ పెండెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనరపరచి 8 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో బి.మునిచంద్ర, సంతోష్, పవిత్ర, సంజన, జాఫర్, అండర్-17లో మాబూ బాషా, దుర్గ, ముజీబ్‌లు ఎంపికయ్యారు. వీరందరూ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ పాండురంగ రాజు బుధవారం తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పట్ల హెచ్ఎం మైఖేల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో 'వైఎస్ఆర్' మహిళా మార్ట్

- డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

గోనెగండ్లలో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేస్తామని డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం గోనెగండ్లలోని మండల మహిళా సమాఖ్య సమావేశ భవనంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ సమాఖ్య సభ్యులు, విఓఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ చేయూత పథకం కింద మండలంలో 16 వేల మంది పొదుపు సంఘాల సభ్యులు ఉన్నారని తెలిపారు. ఒక్కో సభ్యురాలి నుంచి రూ.400 చొప్పున వసూలు చేసి ఆ సొమ్ముతో గోనెగండ్లలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మార్ట్‌లో నిత్యావసర సరుకులతో పాటు బయట సూపర్ మార్కెట్లలో దొరికే ప్రతి వస్తువు నాణ్యతతో పాటు సరసమైన ధరలకే అందజేయనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన మౌలిక వసతులను నిర్వహణ కమిటీ త్వరగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, వైకెపి ఎసి శ్రీనివాసులు, ఎపిఎం హేమలత పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

పట్టణంలోని కింగ్ ప్యాలెస్‌లో మంగళవారం రాత్రి ఆల్ క్రిస్టియన్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డిప్యూటీ డిఇఒ సుకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్ బాబు, ఎఐసిసి లీగల్ అడ్వైజర్ డేవిడ్, ఎంఇఒ శివరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దైవ సేవకుడు జాన్ కిష్టఫర్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రీస్తు చూపిన ప్రేమ, దయా, కరుణ కలిగి జీవించాలని తెలిపారు. అనంతరం అతిథులు కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్టియన్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ సుధాకర్, చెన్నయ్య, ఆదిమూర్తి, మధు, చిన్న, సునీల్ రాజ్ కుమార్, న్యూటన్ రాజు, సంగటి దేవదానం, జాన్సన్, ఆవుల బసప్ప, భాస్కర్, షాషా నర్సింగ్ హోమ్ డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

- పీఠాధిపతులు శ్రీసుభుదేంధ్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డును పరిశీలిస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ముఖద్వారం ఎదురుగా వేసిన రోడ్డుపై పెచ్చులు లేవడం గమనించిన పీఠాధిపతులు శ్రీసుభుదేంధ్ర తీర్థులు మరమ్మతులు చేపట్టాలని మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావును ఆదేశించారు. బుధవారం శ్రీమఠం ముందు భాగంలో నిర్మించిన కారిడార్‌పై చిత్రలేఖనాన్ని పరిశీలించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఆగస్టులో వేసిన సిసి రోడ్డుపై పెచ్చులు లేవడం ఆయన గమనించారు. స్పందించిన ఆయన రోడ్డు దెబ్బ తినలేదని, కేవలం పెచ్చులు లేవడం జరిగిందని, వెంటనే ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పలు అభివృద్ధి పనులను ఆయనతో ప్రస్తావించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

- ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్, మలేరియా విభాగం అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్న డాక్టర్లు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్, పత్తికొండ డివిజన్ మలేరియా విభాగం అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బెల్డోన గ్రామంలో మహిళలకు, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సూచనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో కల్తీతో కూడుకున్న ఆహారం తినడం వల్ల ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోకి డాక్టర్లు వస్తున్నారని, వారితో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఎఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

లేఅవుట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలను ప్రజలకు కనపడేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆదోని మండలం మండగిరి, ఆరెకల్ గ్రామ సచివాలయం, లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్యశ్రీ యోజనకు సంబంధించి లబ్ధిదారుల నుంచి వివరాలు తీసుకొని త్వరగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రోజూ వాలంటీర్లకు లక్ష్యం కేటాయించి, పూర్తి చేసేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. వారం రోజుల్లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వారు చేసే రోజు వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సంబంధించి నాడు-నేడు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు తదితర వాటికి ప్లాన్ వేసి అమలు పరిచేలా చూడాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడీలు, పాఠశాలలను తనిఖీ చేసి అనీమియా బారిన పడకుండా రికార్డు నిర్వహించాలని తెలిపారు. హై రిస్క్ గర్భిణులకు సంబంధించి సచివాలయాల వారీగా నివేదికలు తయారు చేసి, వారిని వారం రోజుల ముందు ఆస్పత్రిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కార్యకర్తను ఆదేశించారు. సచివాలయ పరిధిలో ఉన్న వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా కృషి చేయాలని సంక్షేమ అసిస్టెంట్‌కు సూచించారు. సచివాలయ పరిధిలో ఉన్న వసతి గృహాల్లో నిత్యం పర్యటిస్తూ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలన్నారు. వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళ పోలీసులు వారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు సమస్యలు వస్తే వాటిని ఎదుర్కోవడానికి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వారి మొబైల్ ఫోన్‌లో దిశా యాప్ ఇన్‌స్టాల్ చేసుకునేలా దిశా నిర్దేశం చేయాలన్నారు. ముందుగా ఆరెకల్ సచివాలయంలో సిబ్బంది బల్లలపై వారు చేయాల్సిన విధుల పట్టికలను చూసి ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన ఎంపిడిఒ గీతావాణిని అభినందించారు. ఇలా అన్ని సచివాలయాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డిని ఆదేశించారు. జగనన్న కాలనీలో 58 ఇళ్లు మంజూరు కాగా, 45 ఇళ్లు ప్రారంభించామని, వాటిలో 34 ఇళ్లను థర్డ్ పార్టీ ద్వారా నిర్మిస్తున్నామని, వాటిలో బిలో బేస్‌మెంట్ లెవెల్ 13, బేస్‌మెంట్ లెవెల్ 14, ఫ్లింత్ లెవెల్ 7 వరకు ఉన్నాయని హౌసింగ్ పీడీ వివరించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆదోని తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ గీతావాణి పాల్గొన్నారు.

ఘనంగా భవాని మాత ఇరుముడులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని గుమ్మనూరు గ్రామంలో భవాని మాత ఇరుముడి కార్యక్రమాన్ని వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గుమ్మనూరు నారాయణ, శ్రీధర్ భవాని మాత ఇరుముడి ధరించిన అనంతరం గ్రామంలో భవాని మాల ధరించిన 46 మందికి ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అనేక గ్రామాల నుంచి బంధువులు, అభిమానులు తరలివచ్చారు. పూజల అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దీక్ష విరమణ చేపడుతున్నట్లు వారు తెలిపారు. మండలంలోని అధికారులు, వైసిపి నాయకులు రాజన్న, షేకన్న, సతీష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మనూరు నారాయణకు పూలమాలలు వేస్తున్న అభిమానులు

ప్రభుత్వ , పోలీసు సహకారంతోనే అనంతబాబుకు బెయిల్

- మాలమహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళిత యువకుని అత్యంత కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుకు ప్రభుత్వం, పోలీసులు నిస్సిగ్గుగా సహకరించడం దారుణమని మాల మహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షులు సి.రంగయ్య విమర్శించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టం నిర్దేశించిన సమయంలో విచారణ పూర్తి చేసి ఛార్జిషీట్ వేయకపోవడం వల్లనే మధ్యస్థ బెయిల్ వచ్చిందని తెలిపారు. మిగిలిన నిందితులను గుర్తించి అరెస్టు చేయకపోవడం, కాల్ డేటా రికార్డులను సేకరించకపోవడం వల్లనే ఈ కేసు విచారణ ఉద్దేశ్య పూర్వకంగా జాప్యం చేశారని చెప్పారు. కేసును సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. అనంతబాబుకు శిక్షపడే వరకూ సుబ్రమణ్యం కుటుంబానికి దళిత, ప్రజా సంఘాలు అండగా ఉంటాయన్నారు. తాలూకా అధ్యక్షులు ఉసేనప్ప, తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు చినబాబు, తాలూకా సెక్రటరీ మల్లేష్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - దేవనకొండ

జగన్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయి అస్తవ్యస్తంగా తయారైందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. బుధవారం దేవనకొండ మండలం వెలమకూరు, కుంకనూరు, పొట్లపాడు గ్రామాల్లో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టిడిపి శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడారు. వైసిపి పాలనలో ఉద్యోగులకు జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు మాలిక్ బాష, మల్లయ్య, ఆకుల వీరేష్, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, వెంకటస్వామి గౌడ్, మాజీ ఎంపిటిసి వెంకటేష్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని అమరావతి నగర్‌లో టిడిపి కర్నూలు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి వార్డు క్లస్టర్ యూనిట్ సభ్యులతో కలిసి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనం కష్టాలు వారి నోటి వెంట వినడమేకాక ఇబ్బందులు, సమస్యలపై టిడిపి బృందాలు ప్రజాభిప్రాయ సేకరిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఈ దుస్థితికి ప్రభుత్వ అసమర్థ, అరాచక పాలనే కారణమని ప్రజలు గుర్తించేలా టిడిపి శ్రేణులు పని చేయాలన్నారు. నాయకులు మహ్మద్, నూర్జహాన్, రవి, కృష్ణ, సికందర్, మల్లికార్జున, ఈరన్న, నాగేందర్ రెడ్డి, శాంతి, హనుమంతు పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని పులిచింత, పొనకలదిన్నె, టి.సోమలగూడురు, మిట్టాసోమపురం, గురజాల, రాయచోటి, నాగలదిన్నె, మాచాపురం గ్రామాల్లో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, పులిచింత సర్పంచి బండే గురు స్వామి, టిడిపి కన్వీనర్ చిన్న రాముడు, టిడిపి మండల ఉపాధ్యక్షులు కాసీం వలీ, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఈరన్న, జబ్బార్, మిట్టా సోమాపురం వీరేష్, ఐ టిడిపి వీరేష్, ఆదిశేషు, ఆనంద్, రామలింగడు, హనుమంతు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 16వ వార్డులో మాజీ కౌన్సిలర్ మైనార్టీ నాయకులు కలీముల్లా పర్యటించారు. పట్టణం ఇంటింటికి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ముల్లా ఇస్మాయిల్, మహబూబ్ బాషా, సమీ, బాలచంద్ర, జుబెర్, రాజు పాల్గొన్నారు.

దేవనకొండలో సుజాతమ్మకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆదోనిలో ప్రభుత్వ లోపాలను వివరిస్తున్న భూపాల్ చౌదరి

నందవరంలో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ కలీముల్లా

అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ

ప్రజాశక్తి - నందవరం

కనకవీడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుచరిత, వైసిపి నాయకులు వెంకట రాముడు, హరిచంద్ర, తిమ్మప్ప బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిల్లలను దృష్టిలో ఉంచుకొని సరైన సదుపాయాలతో నూతన అంగన్వాడీల నిర్మాణాలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిధులు కేటాయించారని తెలిపారు. రూ.13 లక్షలతో అంగన్వాడీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచి మద్దేశ్వరి సహకారంతో అంగన్వాడీ కేంద్రానికి స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోటే సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. వాటిని పూర్తి చేసి ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు.

పరిశుభ్రమైన తాగునీటికి కృషి

ప్రజాశక్తి - నందవరం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందుకు కృషి చేస్తామని చిన్నకొత్తిలి సర్పంచి శివన్న తెలిపారు. బుధశారం మండలంలోని చిన్నకొత్తిలి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పంచాయతీ ఆధ్వర్యంలో పైపులైన్ పనులను సర్పంచి శివన్న, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఫెసిలేటర్ కరుణప్ప, ఆర్డిప్ సంస్థ ఈడబ్ల్యు ఉసేని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... శుభ్రమైన నీరు తాగడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ సర్పంచి సోమన్న, రఘునాథ్, మహబూబ్ బాష, రాముడు, రామాంజినేయులు, వీరేష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: ADONI.O.S.NO.385/2019.

Between:
Sri.V.Sreenivasulu. ...Plaintiff.
V/s
Vadde Ramanjeneyulu. ...Defendant.

SUMMONS TO DEFENDANT

To
Vadde Ramanjeneyulu, S/o. Vadde Hanumanna, Hindu aged about 41 yrs, Business, H.NO.6-763, Resident of Holagunda Village & Mandal, KURNOOL District.,

Whereas the above named Plaintiff filed above case for recovery of promissory note amount against you. Hence take the summons, if you have got any objection for the above suit, you may appear before this Hon'ble Court on 04.01.2023, at 10.30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the suit will be decided ex-parte.

//BY ORDER OF THE COURT//

V.SRIRAMULU,
B.Com., LL.B.,(Spl).,
ADVOCATE
FOR PLAINTIFF ADONI.
Cell.No.9440244475.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా, మా క్లయింట్ షేక్ ఫాతిమా భర్త. షేక్ మహబూబ్ బాష, యస్.బి.ఐ. కాలనీ, కర్నూలు సిటి. ఈమే కర్నూలు నుండి కె.నాగలాపురం వూరికి వచ్చి పనిచూసుకొన్న పిదప తన ప్లాట్లు యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్, కర్నూలు రిజిస్ట్రేషన్ ఆఫీసు నందు రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్ నెంబర్లు :9430/2015, 9431/2015 పడిపోవడం జరిగింది. కావున పై తెల్పిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనను దొరికి ఉండిన ఈ క్రింది అడ్రస్ వారికి వెంటనే ఇవ్వగలరు లేదా పైన తెలిపిన ఒరిజినల్ డాక్యమెంట్స్ ఎవరి దగ్గరైనను అక్రమముగా ఉన్న యెడల మాకు సమాచారం వెంటనే ఇవ్వవలసిందిగా కోరుతున్నాము. పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ దొరికిన వ్యక్తులు ఈ క్రింది అడ్రస్ వారికి ఇవ్వకుండా చట్ట వ్యతిరేకముగా క్రయ విక్రయములు జరిపిన అట్టి వారిపై చట్టపరముగా క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. ఈ విషయమై కె.నాగలాపురం పట్టణ పోలీసు స్టేషన్ నందు తేది: 08-11-2022న ఫిర్యాదు కూడా ఇవ్వడం జరిగినది.

సంప్రదించవలసిన అడ్రస్ :
యన్.జంబన్న, అడ్వకేట్,
ఇంటి నెంబరు:45/403-126,
భగత్ సింగ్ నగర్, కర్నూలు.
సెల్ :90322 34617, 7989639186.

పాముకాటుతో వలస కూలీ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన వంకాయల వెంకటలక్ష్మి (37) అనే వలస కూలీ పాముకాటుతో బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వివరాల మేరకు... గ్రామంలో వ్యవసాయ పనులు ముగియడంతో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు పత్తి తీసేందుకు వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులతో వలస వెళ్లారు. పొలంలో పని చేస్తుండగా పాము కాటు వేయడంతో చికిత్స నిమిత్తం అక్కడున్న ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులు

హాలహర్వి : విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హాలహర్వి జడ్‌పిహెచ్ స్కూల్‌లో విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ మాట్లాడారు. 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

ఐసిడిఎస్‌లో పర్సెంటేజీల వ్యవహారంపై విచారణ

ఆలూరు : ఆలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలకు 5 నెలలకు సంబంధించిన కూరగాయల బిల్లుల్లో అధికారులు పర్సెంటేజీలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో బుధవారం విచారణ చేపట్టారు. ఆదోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి ఉమామహేశ్వరమ్మ అంగన్వాడీ కార్యకర్తలతో సెక్టార్ల వారీగా విచారించారు. భయపడి చెప్పకపోతే రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని కోరారు. మమ్మల్ని ఎవరూ పర్సెంటేజీలు అడగలేదని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రావూస్ విద్యార్థి

ఎమ్మిగనూరు : పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థి నరసింహులు సిఎం కప్ కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో బిఏ రెండో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న నరసింహులు ఇటీవల తాలూకా, జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నరసింహులును కళాశాల అధ్యాపకులు పుల్లయ్య, వెంకటేశులు, అన్నపూర్ణ, జయలక్ష్మీ, వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ, గోవిందు బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న సుకుమార్

గోనెగండ్లలో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి

విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న జడ్‌పిటిసి

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

- ఆదోని డిప్యూటీ డిఇఒ సుకుమార్

ప్రజాశక్తి - ఆదోని

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు అని డిప్యూటీ డిఇఒ కెజె.సుకుమార్, ఎంఇఒ శివరాములు తెలిపారు. బుధవారం ఆదోని మున్సిపల్ హైస్కూలులో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన దాదాపు వంద సైన్స్ ప్రయోగ నమూనాలను వారు పరిశీలించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ఆలోచనలను వెలికితీసే ప్రయత్నం నిరంతరం జరుగుతూనే ఉండాలని తెలిపారు. విద్యార్థులకు సాంకేతికతతోపాటు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించడంలో సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, సైన్స్ ఉపాధ్యాయులు కె.రవి, సతీష్, గిరి, దస్తగిరి, ఖలీల్, శివ కుమారి, సుశీలమ్మ, చంద్రవతి పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను ఎంపిపి నసురుద్దీన్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎంఇఒ వినోద్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో సహ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, ఎపి మోడల్ పాఠశాల, పెద్దనేలటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హెచ్.కైరవాడి పాఠశాలల నుంచి విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఐదు పాఠశాలల నుంచి 100 ప్రయోగాలను తయారు చేయగా అందులో 80 గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవి కావడం విశేషం. పర్యావరణం, గణిత, మోడలింగ్, ఆరోగ్యం, సాఫ్ట్ వేర్ తదితర రంగాల నుంచి విద్యార్థులు తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఐదు పాఠశాలల్లో ఒక్కో దాన్నుంచి రెండు చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. వీరు జనవరి 28, 29న జిల్లా స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా సైన్స్ ఉపాధ్యాయులు విజయకుమార్ వ్యవహరించారు. ఉపాధ్యాయులు అయ్యస్వాములు, అమానుల్లా బేగ్, జె.ఉస్మాన్, మహబూబ్ బాషా, గుమ్మలబాబు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పాముల ఉస్మాన్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

- జడ్‌పిటిసి రామకృష్ణ

ప్రజాశక్తి- దేవనకొండ

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిని, జడ్‌పిటిసి రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శన చేపట్టారు. మండలంలోని కప్పట్రాళ్ల, తెర్నేకల్, గుండ్లకొండ, కెవి.పురం, కుంకనూరు, కరివేముల, కెజిబివి పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు నిర్వహించారు. 9 రకాల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవడం వల్ల నైపుణ్యం పెంపొందించుకుంటారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున్న మహిళ

ఆస్పరిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో మధు ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి రాధమ్మ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలియని జబ్బులతో బాధపడుతున్న వారికి ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. మధు హాస్పిటల్ యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని తెలిపారు. అనంతరం డాక్టర్ పి.అనిల్ కుమార్, డాక్టర్ వై.లక్ష్మిలు ఉచిత రక్త పరీక్షలు, గుండె, బీపీ, షుగర్, రొమ్ము గడ్డలు, కాళ్లకు గాయాలు, గర్భిణులకు గర్భకోశ, అండాశయ, థైరాయిడ్ సమస్యలు, అధిక బీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. 263 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరికొందరిని కర్నూలు నగరంలోని ఆస్పత్రికి రెఫర్ చేశారు. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి రామాంజనేయులు, మధు హాస్పిటల్ మేనేజర్‌లు సునీల్ కుమార్, సిద్ధు పాల్గొన్నారు.

మాదారి, మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

- నారా లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - హోళగుంద

మాదారి, మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని కనకశ్రీ యూత్ మండల నాయకులు మంజునాథ్ గౌడ్ కోరారు. బుధవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. బీసీ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారని చెప్పారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే దాదాపు 6 లక్షల ఓటర్లు కలిగి ఉన్నామని తెలిపారు. నారా లోకేష్ మాట్లాడుతూ... 2024లో టిడిపి అధికారంలో వచ్చిన వెంటనే కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చే విధంగా చేస్తామని హామీఇచ్చారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా, మా క్లయింట్ షేక్ షమ్స్ తబ్రేజ్ తండ్రి. షేక్ మహబూబ్ బాష, యస్.బి.ఐ. కాలనీ, కర్నూలు సిటి. ఈమే కర్నూలు నుండి కె. నాగలాపురం వూరికి వచ్చి పనిచూసుకొన్న పిదప తన ప్లాట్ యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్, కర్నూలు రిజిస్ట్రేషన్ ఆఫీసు నందు రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్ నెంబరు: 9432/2015 పడిపోవడం జరిగింది. కావున పై తెల్పిన డాక్యుమెంట్ ఎవరికైనను దొరికి ఉండిన ఈ క్రింది అడ్రస్ వారికి వెంటనే ఇవ్వగలరు లేదా పైన తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరి దగ్గరైనను అక్రమముగా ఉన్న యెడల మాకు సమాచారం వెంటనే ఇవ్వవలసిందిగా కోరుతున్నాము. పై తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికిన వ్యక్తులు ఈ క్రింది అడ్రస్ వారికి ఇవ్వకుండా చట్ట వ్యతిరేకముగా క్రయ విక్రయములు జరిపిన అట్టి వారిపై చట్టపరముగా క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. ఈ విషయమై కె. నాగలాపురం పట్టణ పోలీసు స్టేషన్ నందు తేది: 08-11-2022న ఫిర్యాదు కూడా ఇవ్వడం జరిగినది.

సంప్రదించవలసిన అడ్రస్ :
యన్.జంబన్న, అడ్వకేట్,
ఇంటి నెంబరు:45/403-126,
భగత్ సింగ్ నగర్, కర్నూలు.
సెల్ :90322 34617, 7989639186.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: ADONI.
I.A.NO.237/2022
IN OS NO.181/2015

Between:
L.Venkanna Goud and another. ...Petitioners.
Vs.
Yakali Chinna Ramanna died by LRs and others. ...Respondents.

TO,
1.Y.Lakshmi D/o. Late. Y. Chinna Ramanna, Hindu, aged about 40 years, cultivator, resident of Lingaladinne village, Kowthalam Mandal, Kurnool District.(Respondent No.5)
2.Y.Mallamma D/o. Late. Y. Chinna Ramanna, Hindu, aged about 39 years, resident of Lingaladinne village, Kowthalam Mandal, Kurnool District. (Respondent No.6)
3.Y.Saraswathi D/o. Late. Y. Chinna Ramanna, Hindu, aged about 32 years, cultivator, resident of Lingaladinne village, Kowthalam Mandal, Kurnool District. (Respondent No.7)

NOTICE

Whereas the above named the petitioners /Plaintiffs filed an application under Order 22 Rule 4 to implead the legal heirs of Respondent No.1, as a Respondent No.5 to 7. You are directed to appear the before this Honorable court on dt.22-12-2022 at 10.30.AM, either in person or through an advocate and file if any objections/ counter, failing which the matter will be decided in your absence and you will be set ex-party.

HEARING DATE: 22-12-2022

SHRI.Y.R.MALLIKARJUNA,
L.VEERABHADRA GOUD
Advocate for Petitioners/PlaintiffsAdoni.

ఘనంగా మారికాంబ దేవి దేవర ఉత్సవాలు

- వైసిపి, టిడిపి నాయకులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తోవి, పొదలకుంట, గోతుల దొడ్డి గ్రామాల్లో మారికాంబదేవి దేవర ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు కుంభాలతో వెళ్లి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో కోలనాటాలతో ఉత్సాహభరితంగా పండగను జరిపారు. ప్రతి ఇంటికీ బంధువులు రావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వివిధ పార్టీ నాయకుల బ్యానర్లు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

నాయకులకు ఘన స్వాగతం : దేవర ఉత్సవాల సందర్భంగా వైసిపి మంత్రాలయం సీనియర్ నాయకులు వై.సీతారామిరెడ్డి తోవి, పొదలకుంట, గోతులదొడ్డి గ్రామాలకు వెళ్లి మారికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈయన వెంట ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, మండల నాయకులు ఏకం రెడ్డి, వెంకటరామ్ రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, తోవి నర్సప్ప, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, నాయకులు బసవ ప్రభు, మరి గౌడ్, అవతారం, తిక్కయ్య, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి దివాకర్ రెడ్డి, కోటేష్ గౌడ్, వెంకటపతి రాజు, కాశీ విశ్వనాథ్, రాజానందు తదితరులు మారికాంబకు పూజలు నిర్వహించారు. గోతులదొడ్డి గ్రామంలో మంత్రాలయం సీనియర్ నాయకులు ఉలిగయ్య ఇంటి వద్ద టిడిపి నాయకుల సందడి నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. టిడిపి కోసిగి మండల నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాల నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. వీరికి టిడిపి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు స్వాగతం పలికారు.

పూజలు నిర్వహిస్తున్న సీతారామిరెడ్డి

బేతంచెర్ల పిఎస్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం పోలీస్ స్టేషన్‌ని జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బేతంచర్ల పోలీస్ స్టేషన్ సిఐ, సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణమును శుభ్రంగా ఉంచుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా నడుచుకొని వారికి చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, పెండింగ్లో ఉన్న ప్రాపర్టీ, అఫైర్స్, దొంగతనాలు, హౌస్ బ్రేకింగ్ వంటి కేసుల దస్త్రాలను పరిశీలించారు. నాటు సారా, అక్రమ మద్యం, ఇసుక, అక్రమ రవాణా వంటివి అరికట్టాలన్నారు. క్రైమ్ అగెనెస్ట్ స్త్రీల కేసులకు సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు ఇచ్చిన ఎడల సత్వరమే స్పందించాలన్నారు. సైబర్ నేరాల ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో నైట్ బీట్, బ్లూ కోటుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి దొంగతనాలు నేరాలు జరగకుండా చూడాలన్నారు. వివిధ కేసులలో ఈ పట్టుబడిన వాహనాలను పరిశీలించి సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని వాటిని త్వరగా డిస్పోస్ చేయాలని ఎస్పి ఆదేశించారు. ఈ కార్యక్రమం ఎస్పీ సిసి ఫయాజ్ బాష, బేతంచెర్ల సీఐ ప్రియతమ్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమణ, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్‌పి కె. రఘువీర్ రెడ్డి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా

మెరుగైన సర్వీసులు అందించాలి

- 95 శాతం ఉద్యోగుల హాజరు ఉండాలి
- గైర్హాజరైన వారికి జీతభత్యాలు నిలుపుదల
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి రోజు కనీసం 10 మెరుగైన సర్వీసులందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఎంపిడిఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటనరీ హాలులో సచివాలయ సర్వీసులు, గ్రామీణ ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ప్రాధాన్యత భవనాల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్వీసులు అందించడంలో వెనుక పడడానికి గల కారణాలను ఎంపీడిఓలను ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు 95 శాతం వుండాలని, అనధికారికంగా గైర్హాజరైన, దీర్ఘకాలిక సెలవులో వెళ్లినా సంబంధిత సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓను ఆదేశించారు. గత వారంలో జిల్లా వ్యాప్తంగా 490 మంది సచివాలయ సిబ్బంది విధులకు హాజరు కాలేదన్నారు. విధులకు గైర్హాజరైన సచివాలయ సిబ్బందికి జీతభత్యాలు నిలుపుదల చేయాలన్నారు. నందికొట్కూరు, ఆళ్లగడ్డ, నంద్యాల అర్బన్ ప్రాంతాలలో పెండింగ్‌లో వున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తి చేయించాల న్నారు. జిల్లాలోని 259 జగనన్న లేఅవుట్లలో నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, అప్రోచ్ రోడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాల స్టేజ్ కన్వర్షన్ వేగవంతం చేయాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. చాగలమర్రి, శిరివెళ్ల, ఉయ్యాలవాడ తదితర అన్ని మండలాల్లో అన్ని ఇండికేటర్‌లలో పర్సంటేజీ తక్కువగా ఉందని వారం వారం ప్రగతి కనపర్చాలన్నారు. బేస్మెంట్ లెవెల్లో ఉన్న ఇళ్లన్నీ పునాది స్థాయికి, పునాది స్థాయిలో ఉన్న ఇళ్లనీ రూఫ్ లెవెల్ కు, రూఫ్ స్థాయిలో వున్నవాటిని పూర్తి స్థాయి స్టేజ్ కన్వర్షన్ దశకు తీసుకరావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లు తదితర ప్రాధాన్యత భవనాల నిర్మాణపు పనులు లక్ష్యం మేరకు గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు సంబంధించి లేబర్ బడ్జెట్ అధ్వాన రీతిలో ఉందని వచ్చే వారానికి పురోగతి పెంచాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, హౌసింగ్ పిడి రామశేషు, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రా రెడ్డి, పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఆర్డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు, డ్వామా ఏపీడిలు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో నష్టపోయిన

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - డోన్

మాండూస్ తూఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు వి. సుబ్బరాయుడు పేర్కొన్నారు. రైతులు అప్పుల ఊబిలోనుండి బయటపడి వ్యవసాయం చేసి బతకాలంటే స్వామినాథన్ కమిషన్ సిపారసులు అమలు చేయాలని ఆయన అన్నారు. ఎఐకెఎస్ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లాలో జరుగుతున్న అఖిల భారత రైతు సంఘం మహాసభలకు సంఘీభావంగా కోట్లవారిపల్లె, హమాలి యూనియన్ కార్యాలయం వద్ద వి. సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు నాగన్నలు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి. సుబ్బరాయుడు మాట్లాడుతూ వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలో కురుకుపోతుందని, రైతంగం పరిస్థితి రోజు రోజుకి మరింత క్షిణిస్తుందని, స్వామినాథన్ సూచనల ప్రకారం మద్దతు ధరల చట్టం తెస్తామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని అధికారంలోకి వచ్చిన పాలకులు ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతులను రక్షించుకుందాం వ్యవసాయాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో డిశంబర్ 13 నుండి 16, 2022 వరకు అఖిల రైతు మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల శక్తులకు అప్పగించేందుకు అప్రజాస్వామీకంగా మూడు నల్ల చట్టాలను బీజేపీ ప్రభుత్వం తెచ్చిందని, అప్పుడు దేశంలో ఉన్న 540 రైతు సంఘాలు ఐక్యమై నిర్బంధాలను ఎదుర్కొని ఏడాదిపాటు సాగిన ఉద్యమానికి తలోగ్గిన బీజేపీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నది తెలిపారు. ఉద్యమ ఉపసంహారణ సందర్భంగా మద్దతు ధరల చట్టం తెస్తామని విద్యుత్ సవరణ చట్టం నుండి వ్యవసాయ రంగానికి మినహాయింపు ఇస్తామని ఉద్యమము సందర్భంగా రైతులపై పెట్టిన కేసులు ఉప సంహారిస్తామని వ్రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని అన్నారు. విద్యుత్ సవరణ చట్టం యాదతదంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం దుర్మారమైన ఆలోచన అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన ఎరువుల ధరలను రైతులకు 80శాతం సబ్సిడీతో ఇవ్వాలని, ఆహార దాన్యాలపైన, పాల ప్యాకెట్లపైన,జి ఎస్ టీ ఎత్తివేయాలని, లేని పక్షంలో బీజేపీ దుష్ట పాలనకు రైతులు, ప్రజలు చరమ గీతం పాడడానికి సిద్దంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోయలకొండ నాగరాజు, సిఐటియు మండల, పట్టణ కార్యదర్సులు రామాంజనేయులు, శివరాం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిన్న రహిమాన్,రైతులు బాస్కర్, రాజు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు

అంగన్వాడీ వర్కర్స్‌కు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్ వాడి వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి. యేసు రత్నం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ. నాగరాజు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా కమిటీ సమావేశం అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షభ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్స్‌కు జూన్ నెల నుండి గ్యాస్ బిల్లులు సెంటర్ అద్దెలు కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని పేర్కొ న్నారు. అంగన్వాడి సెంటర్లకు మౌలిక వసతులు కల్పిం చాలని, మంచినీరు, ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, విద్యు త్ సౌకర్యం, ఫ్యాన్లు, కుర్చీలు ఇవ్వాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెంటర్లకు గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి వర్కర్స్ కు గ్రాట్యూటీ అమలు చేయాలని, నిత్యము ప్రభుత్వానికి ప్రజలకు గర్భవతులకు బాలింతలకు పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్వాడి వర్కర్స్ కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడి వర్కర్స్ కు వేతనాలు పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ అయిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు నేటికి రాలేదని వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేసి రిటైన్ అయిన అంగన్వాడి వర్కర్స్ కు డబ్బులు ఇవ్వాలని కోరారు. రేషన్ సరుకులు అంగన్వాడి సెంటర్ దగ్గరకు వచ్చి సరఫరా చేయాలని కోరారు. జిల్లా కమిటీ సమావేశంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, మంజుల, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, నిర్మలమ్మ, సునీతమ్మ, లక్ష్మీ, శైలజ, ఉదయలక్ష్మి, బాల తిమ్మమ్మ, రసూల్ బి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు ఏసురత్నం

అంగన్‌వాడీలో పుచ్చిన కంది

- దాటవేత ధోరణిలో అధికారులు

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని తమ్మడపల్లె అంగన్వాడీ కేంద్రంలో పుచ్చిన కందిపప్పును చిన్నారులకు వండి పెడుతున్నారు. దీనిపై అధికారు లు దాటవేత ధోరణి అవలంబిస్తు న్నట్లు ఆరోపణలు వివిపిస్తున్నా యి. గత వారం నుంచి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రంలో పుచ్చి పురుగులు పట్టిన కందిపప్పును వంటలో స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఉపయోగిస్తున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని అందిస్తున్న వాటిని పక్కదారి పట్టిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నాసిరకంగా పుచ్చు పట్టిన ఆహార పదార్థాలు చిన్నారులకు వడ్డిస్తున్నారని అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తే వ్యక్తులే బహిరంగంగా చెపుతున్నా ఇవి ఏమీ తమకు పట్టినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు రెండు నెలలకు పైగా అంగన్వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా లేదని ఇది ఎలా వచ్చిందో తమకు తెలియదని అధికారులు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. కందిపప్పు సరఫరా లేకపోవడంతో చిన్నారులకు కూరగాయలతో భోజనం వడ్డించాలని ఆదేశించినట్లు సమాచారం. ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి దీనిపై వివరణ ఇస్తూ గత రెండు నెలల నుంచి అంగన్వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోయినట్లు తెలిపారు. తమ్మడపల్లె అంగన్వాడీ కేంద్రానికి నాసిరకమైన, పుచ్చు పట్టిన ప్రభుత్వ లేబుల్ ఉన్న కందిపప్పు ఎలా వచ్చిందనేది విచారణ చేస్తామన్నారు.

పుచ్చిపోయిన కంది పప్పు

స్థల వివాదంపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు గ్రామంలో సర్వే నంబర్ 182-ఎ లో స్థల వివాదంపై కలబండి స్వామిదాసు ఫిర్యాదు మేరకు ఆత్మకూర్ ఆర్డీవో ఎం.దాసు బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. వీఆర్వో ముర్తుజా, మండల సర్వే భాస్కర్‌తో రికార్డులలో ఎవరున్నారనేది ఆరా తీశారు. ఆర్ఓఆర్, ఆర్ఎస్ఆర్‌లో ఎవరి పేర్లు ఉన్నాయన్నది రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారుడు పైన తెలిపిన సర్వే నెంబర్లో 30 సెంట్లు స్వామి దాసు పేరుపై ఉందని, స్థలాన్ని చూపించాలని చేసిన ఫిర్యాదుపై విచారించినట్లు తెలిపారు. ఆర్ఓఆర్ ప్రకారం విచారించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రత్న రాధిక, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు : సిఐ

ప్రజాశక్తి- కోవెలకుంట్ల

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి అత్యుత్తమ సేవలు అందించినప్పుడే పది కాలాల గుర్తింపు ఉంటుందని సిఐ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బదిలీ అయిన ఎస్సై చంద్రశేఖర్ రెడ్డికి బుధవారం స్థానిక కృష్ణతేజ ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేయాలని, అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కోవెలకుంట్లకు అందించిన సేవలను ఆయన కొనియాడారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై మౌలాన్‌బి, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు

- జిల్లా ఎమ్యునైజేషన్ ఆఫీసర్. డాక్టర్ ప్రభావతి

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందిస్తున్నామని జిల్లా ఎమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రభావతి తెలిపారు. బుధవారం మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న మందుల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత, మందుల స్టాక్ వివరాలు, తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరము తిప్పారెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఇస్తున్న టీకాలను, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత,నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాబు, డాక్టర్ జయలక్ష్మి, సూపర్వైజర్లు బాబయ్య, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరిగే నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభాకరమ్మ, ఇన్చార్జి సూపర్వైజర్ రేణుకమ్మలు మాట్లాడారు. లింగవివక్ష, హెల్ప్ లైన్, సైబర్ క్రైమ్, బాలికలు, మహిళలపై వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు కౌసల్య, లక్ష్మి, స్కూల్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

మెడికల్ సీట్లలో ఎస్‌డిఆర్ కళాశాల ప్రభంజనం

- నీట్ ఫలితాల్లో 17 మెడికల్ సీట్లు
- విద్యార్థులను అభినందించిన ఎంపీ పోచా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

2022 నీట్ ఫలితాల్లో ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ విహారం చేశారు. ఏకంగా 17 మెడికల్ సీట్లు జిల్లాలోని తమకు ఎవరు సాటి లేరని నిరూపించారు. కళాశాల స్థాపించిన అనాతి కాలంలోనే ఇన్ని ర్యాంకులు రావడంపై పలువురు విద్యార్థులను ప్రశంసిస్తున్నా రు. ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాలకు 17 మెడికల్ సీట్లు రావడం అభినందనీయమని నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. 2022 నీట్ ఫలితాలలో ఎస్‌డిఆర్ కళాశాల విద్యార్థులు 17 మెడికల్ సీట్లను సాధించిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులు తమ భవిష్యత్తును ఉజ్వలంగా తయారు చేసుకోవాలని, సమాజానికి సేవలందించాలని కోరారు. ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, సమయ పాలన, ప్రణాళికాబద్దంగా విద్యాబోధన చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేయడంతో ఎక్కువ మందికి మెడికల్ సీట్లు సాధించే అవకాశం వచ్చిందన్నారు. విద్యార్థులు ఉత్తమ శిఖరాలకు ఎదగాలన్నదే ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల లక్ష్యమన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కాలేజీలో తగిన జాగ్రత్తలు తీసుకుని విద్యను అందిస్తున్నామని తెలిపారు. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కొండారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఓబుల్ రెడ్డి, కళాశాల అధినేత వెంకటరామిరెడ్డి కళాశాల అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ డి ఆర్ కళాశాలలో మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థుల అభినందన సభలో పాల్గొన్న నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మరెడ్డి

మిఠాయి తినిపిస్తున్న ఎంపీ పోచా

చంద్రుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, వి . ఏసురత్నం ఏ .నాగరాజు

చంద్రుడు ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

కార్మిక సమస్యలపై ఉద్యమించిన నాయకుడు చంద్రుడు అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి . ఏసురత్నం ఏ .నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయ సమావేశ భవనంలో చంద్రుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ నాగరాజు మాట్లాడుతూ చంద్రుడు చిన్నతనం నుండి ప్రజా ఉద్యమాల్లో సిపిఎంలో, సిఐటియు జిల్లా నాయకులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యల పైన కార్మికుల సమస్యల పైన ఉద్యమాలు నిర్మించిన వ్యక్తి చంద్రుడని పేర్కొన్నారు. చంద్రుడి ఆశయాలను పార్టీ నాయకులు ,కార్యకర్తలు ముందుకు తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కేఎండి గౌస్, బాల వెంకట్, లక్ష్మణ్, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేభా రాణీ, నిర్మలమ్మ గోస్పాడు నిర్మలమ్మ మదార్ బి, ఎస్ ఎఫ్ ఐ నాయకులు మధు, కిరణ్, సాయి కుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు : చంద్రుడు ఆశయాలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు పేర్కొన్నారు. నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయం ఆవరణలో టి.చంద్రుడు ఐదో వర్ధంతి సభ పి.పకీర్ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చంద్రు డు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుండి అంచలం చెలుగా కార్మిక నాయకుడిగా, సిపిఎం డివిజన్ కార్యదర్శిగా అనేక పదవుల్లో కొనసాగుతూ లారీ, హమాలీ, అంగన్వాడీ, ఆశ, గ్రామ సేవకుల కోసం అనేక కార్మిక పోరాటాలు నిర్వహించి, హక్కుల కోసం పని చేశారని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు కె భాస్కర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పి.వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు బెస్త రాజు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, ఓబులేసు, సిఐటియు, వ్యకాసం, కెవిపిఎస్, మహిళా సంఘం నాయకులు గోపాలకృష్ణ, వేణుగోపాల్, లింగస్వామి, సోడా బిబి, నూర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు, నాయకులు

ప్రజల సంక్షేమమే వైసిపి లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించడమే వైసిపి లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 2, 23, 24వ వార్డుల పరిధిలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మరుఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్‌లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు నవరత్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024లో జరగబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారాన్ని చేపట్టబోతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పెనుగొండ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మూల రాజగోపాల్, పలు శాఖల అధికారులు, వార్డు కౌన్సిలర్లు గురుపాటి విజయ్ చౌదరి, మిట్టకందాల మహబుతుల్లా సుల్తాన్, కలిముల్లా, రంగస్వామి, గౌస్ లాజం, ప్రకాష్ రావు, మారుబోతుల విజయ్, పాణ్యం పార్వతి, మాజీ వార్డ్ కౌన్సిలర్ తిమోతి, నూర్ మొహమ్మద్, లాలూ స్వామి, పాన్ భాష, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** వైసిపి ప్రభుత్వం లో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఆర్థర్ పేర్కొన్నారు. నందికొట్కూరులోని 6వ వార్డులో సుబ్బారావు పేట, లింగం వీధి, కాలేజీ రోడ్డు, కాలనీల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దేశెట్టి శ్రీనివాసులు, మాబాష, కౌన్సిలర్లు ఉండవల్లి ధర్మారెడ్డి, మొల్ల జాకీర్ హుస్సేన్, వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్ చందమాల బాలస్వామి, వైసిపి నాయకులు తమ్మడపల్లి విక్టర్, రిటైర్డ్ పోలీస్ అధికారి జాన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ వనజ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పాఠశాలలను ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలను యుఆర్‌డి ఫక్రుద్దీన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనంలో భాగంగా ఇస్తున్న కోడిగుడ్డు, చిక్కి నాణ్యతను, స్టాకు రిజిస్టరు పరిశీలించి, తగు సూచనలు జారీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువగలుగుతారని, కనుక వారికి నాణ్యమైన భోజనం అందించడం మన బాధ్యతని తెలియచేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, యండియం రిజిస్టరు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంక్షేమ, విద్య సహాయకులు మధు, మహిళ పోలీసు షేక్ కుర్శీదాబాను పాల్గొన్నారు.

రబీ పంటకు ఈ క్రాప్ నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రబీలో సాగు చేసిన పంటలను రైతులు ఈ- క్రాప్ ద్వారా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి పవన్ కుమార్ అన్నారు. బెలుం గ్రామంలోని పంటలను ఎఒ బుధవారం పరిశీలించారు. అనంతరం ఈక్రాప్ నమోదును ప్రారంభించారు.

ఘనంగా నేషనల్ ఎనర్జి కన్జర్వేషన్ డే

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లేకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బసవపున్నయ్య చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న నాయకులు

బసవ పున్నయ్య జీవితం ఆదర్శనీయం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన బసవ పున్నయ్య జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్ పేర్కొన్నారు. పట్టణంలోని డాక్టర్ ఏ ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బసవ పున్నయ్య 108వ జయంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన నాయకులలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరని తెలిపారు. భారతదేశంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన వక్రీకరణలకు వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాటం కొనసాగించారని చెప్పారు. స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూతో కలిసి పని చేశారని, విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. జమీందారులకు వ్యతిరేకంగా దోపిడీ లేని పేదరికం, నిరుద్యోగం లేని సమాజాన్ని నిర్మించాలని ఆయన కృషి చేశారని తెలిపారు. ఆయన జీవితకాలమంతా రాజీ పడకుండా కమ్యూనిస్టు ప్రమాణాలకు లోబడి పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.వెంకటేశ్వరరావు, డి.రామ్ నాయక్, ఏ.సురేంద్ర, శిలార్, అంబయ్య, విజయ్, సీతారాం నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలోని బర్డ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు,హెచ్ఎం సింధూర బుధవారం తెలియజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఇటీవల నంద్యాల జిల్లా గోవిందపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలలో పాఠశాలకు చెందిన షాన్ ధీరజ్,భార్గవిలు వెండి పతకాలు,వెంకట తేజస్విని,డింపల్, గురుదివ్యలు అత్యంత ప్రతిభ కనబరచి కాంస్య పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయి కి ఎంపికైనట్లు వారు వివరించారు. రానున్న ఫిబ్రవరి 2 నుంచి మహారాష్ట్ర రాష్ట్రంలోని షిరిడిలో జరిగే జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలలో పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయి ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రవిశంకర్‌ను బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు,హెచ్ఎం సింధూర,పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు,ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

క్షేత్రస్థాయి భూ రికార్డుల స్వచ్ఛీకరణపై సంపూర్ణ శిక్షణ

- జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భూముల సమగ్ర రీ సర్వే నేపథ్యంలో క్షేత్రస్థాయి భూ రికార్డుల స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్స్)పై సంపూర్ణ శిక్షణ పొందాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో క్షేత్రస్థాయి భూ రికార్డుల స్వచ్ఛీకరణ కార్యక్రమంపై తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న భూరక్ష, శాశ్వత భూ హక్కు పథకం కింద వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న రీ సర్వేలో రికార్డుల స్వచ్ఛీకరణ అత్యంత కీలకం కావడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తయితేనే గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, ల్యాండ్ అండ్ సర్వే సహాయ సంచాలకులు హరికృష్ణలు రెవెన్యూ పరంగా సర్వే బృందాలకు సంపూర్ణ శిక్షణనిచ్చారు. తహశీల్దార్లు మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసి లో మాట్లాడుతున్న జేసి నిశాంతి

కౌలు రైతులకు ఎకరాకు రూ. 30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

మాండూస్ తుఫాను వలన నష్టపోయిన కౌలు రైతులకు ఎకరాకు రూ. 30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుస్తెల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో గత మూడు రోజుల నుండి తుఫాన్ వలన రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. వరి, మిరప, సోయా, చిక్కుడు, మినుము పంటలకు వర్షం వలన తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. పంట చేతికి వచ్చిన కొన్ని ప్రాంతాలలో వరి నేలకొరిగి గింజలు రాలిపోయి, తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు. వేల పెట్టుబడి పెట్టి మిరపను కల్లాలో ఆరపెట్టుకున్న సమయంలో వర్షం కురియడంతో పూర్తిగా నానిపోయి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. అలాగే పూతకొచ్చిన మినుము పంట మూడు రోజులు మబ్బులు, వర్షాలు రావడంతో రాలిపోయిందన్నారు. ఎకరాకు రూ. 30 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఎలాంటి కౌలు రైతు కార్డులు (సిసిఆర్‌సి) లేకపోయినా పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే తడిసిన పంటలన్నిటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

మాండూస్ బాధిత రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

మాండూస్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆ పార్టీ బృందం పరిశీలించింది. గ్రామానికి చెందిన రైతు ముత్తుతో వారు మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా మాండూస్ తుపాన్ ప్రభావంతో వరుసగా కురిసిన వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి పంట నేల కూలి, ధాన్యం మొలకలు వస్తున్నాయని చెప్పారు. పంట కోత సమయంలో ఇలా సంభవించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, పంట నష్టం జరిగిన ప్రతి రైతుకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, వేణు, నీటి సంఘం చైర్మన్ కాగుల శంకర్ యాదవ్, కుమ్మరి రాముడు, వడ్డే శంకర్, వడ్డే శివ పాల్గొన్నారు.

గని యజమానుల సమస్యలు పరిష్కరించాలని నేడు దీక్ష

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గ గని యజమానుల సమస్యలను పరిష్కరించాలని నేడు దీక్ష చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధనరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గని యజమానుల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కొలిమిగుండ్ల మండలం బందర్లాపల్లె చెక్‌పోస్ట్ వద్ద దీక్ష చేయనున్నట్లు చెప్పారు. నేడు ఉదయం 8 గంటలకు అంకిరెడ్డిపల్లె నుండి గని యజమానులు, కార్మికులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా దీక్షా స్థలికి వెళ్లి అక్కడ దీక్ష ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. **అవుకు :** నాపరాతి గని సమస్యల కోసం బందర్లపల్లి చెక్పోస్ట్ దగ్గర బనగానపల్లి మాజీ శాసనసభ్యుడు బీసీ జనార్దన్ రెడ్డి గురువారం తలపెట్టిన దీక్షను విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు ఐవి పక్కిరా రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ జనార్దన్ రెడ్డి ఉదయం 8 గంటలకు అంకిరెడ్డిపల్లి నుండి గని యజమానులు, కార్మికులు, కార్యకర్తలతో కలిసి బందార్లపల్లి చెక్పోస్ట్ వద్ద ఏర్పాటుచేసిన దీక్షాస్థలికి చేరుకుని దీక్షను ప్రారంభిస్తారని అన్నారు. అధిక రాయలటీల వలన నాపరాతి గనుల మీద ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలకు అధిక భారం పడుతుందని అన్నారు. దీక్షకు మద్దతుగా సంఘ పట్నం, సుంకేసుల, చెర్లోపల్లి, రామాపురం గ్రామాలకు చెందిన గని యజమానులు,కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో రాయల్టీ చెక్ పోస్టు వద్ద నాపరాతి పరిశ్రమపై రాయల్టీ భారంపై బీసీ జనార్ధనరెడ్డి చేపడుతున్న దీక్షను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అంకిరెడ్డిపల్లె నుండి గని యజమానులు, కార్మికులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా దీక్షా స్థలికి వెళ్లి అక్కడ దీక్ష ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న బీసీ జనార్దన్ రెడ్డి

తహశీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె తహశీల్దార్‌గా పని చేస్తున్న రామకృష్ణకు డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రమోషన్ల జాబితాలో తహశీల్దార్ రామకృష్ణ కూడా ఉన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్ పొందిన తహశీల్దార్ రామకృష్ణను ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు శివయ్య యాదవ్, బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్ వచ్చిన ఎమ్మార్వో సన్మానిస్తున్న దృశ్యం

రైతులకు భరోసా ఇవ్వని ఆర్‌బికెలు ఎందుకు..? : టిడిపి

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

రైతులకు భరోసా ఇవ్వని రైతు భరోసా కేంద్రాలు ఎందుకుని టిడిపి నేత, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పడిగపాడు గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు చేసిందని ఏమీ లేదన్నారు. గొప్పలు చెప్పడమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ప్రతి ఒక్కరూ వైసిపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకుడు కుడా నారాయణరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి, మైలార్ మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

కోవెలకుంట్ల : వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ టిడిపి ఇంచార్జి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బిజనవేముల గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు న్యాయకత్వంలో రాష్ట్రం, ఇటు బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని తెలుపుతూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చా ర్జ్ అభిరుచి బాల మద్దిలేటి, క్లస్టర్ ఇన్చార్జి రవీంద్ర రెడ్డి, బూతు సభ్యులు డి. హుసేనయ్య, రాద క్రిష్ణ,పెద్ద హుసేనయ్య, అన్వర్ బాషా, మనోహర్, సుబ్బరాయుడు, లక్ష్మి నరసయ్య, రామకృష్ణ, గ్రామ కార్యకర్తలు శివకుమార్, ప్రసాద్, బాలకృష్ణ, లక్ష్మి నరసయ్య, సుబ్బారెడ్డి, హుస్సేన్ పీరా, పెద్ద హుసేనరెడ్డి షరీఫ్,అత్తార్ షరీఫ్, తిమ్మారెడ్డి,భక్త శేషరెడ్డి,ప్రసాద్ తూర్పునాటి శ్రీను, బంగారయ్య, వేంగన్న,గౌసు,రమేష్ రాజ రాం, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు : సర్పంచి

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లె, తువ్వ పల్లి, గ్రామాల్లోసర్పంచ్ విజయలక్ష్మి, వైసిపి నాయకుడు బైరిబ్రహ్మం పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ రెడ్డిపల్లె, తువ్వపల్లెలో పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించి ఆ మట్టిని ట్రాక్టర్ ద్వారా ఊరి బయట వేయడం, మురుగునీటి కాలువలు, వీధులను శుభ్రం పరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణకు క్రిమిసంహారక మందులను చల్లించడం జరిగిందన్నారు. ప్రజలు కూడా వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, దోమలను నివారించుకోవాలని ప్రజలకు సూచించారు.

రాష్ట్రానికి శ్రీనిధి కింద రూ.50 కోట్లు

- ఎన్ఎస్ఎఫ్‌డిసి జనరల్ మేనేజర్ కృష్ణవేణి

ప్రజాశక్తి - పగిడ్యాల

మినిస్ట్రి ట్రైబల్ అఫైర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీనిధి బ్యాంకుకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.50 కోట్లు మంజూరైనట్లు ఎన్ఎస్ఎఫ్‌డిసి జనరల్ మేనేజర్ కృష్ణవేణి, శ్రీనిధి ఎజిఎం నాగప్రసాద్ తెలిపారు. బుధవారం శ్రీనిధి కింద లబ్ధిదారుల పొరకలు, ముగ్గుపొడి తయారు చేసి పొందుతున్న జీవనోపాధిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి శ్రీనిధి కింద మంజూరైన నిధులు ఎస్‌టి సంఘాలకు మాత్రమే వారి జీనోపాధలకు రుణాలుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని యమునా సంఘంలోని ముగ్గురికి రూ. 50 వేలు రుణాలు ఇచ్చామన్నారు. గ్రూపుల ద్వారా ఎస్‌టిలు జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని ఆదాయం పెంపోందించుకుని ఆర్థికంగా ఎదగాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాసులు, సిసి యాపిలయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నీటి మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - డోన్

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ప్రజలపై నీటి మీటర్ల పేరుతో భారాలు మోపడం తగదని, ఈ విధానంను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో సిపిఎం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో ప్రజల మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతున్నారని, మళ్ళీ నీటి మీటర్ల పేరుతో ప్రతి ఇంటికి అదనపు భారం మోపడం దుర్మార్గమన్నారు. ఒకవైపు చెత్త పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను ఇలా రకరకాల పేర్లతో భారాలు వేస్తున్నారని, రైతులకు వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించేందుకు శ్రీకాకుళంలో ప్రయోగం చేశారని, దాన్ని రాష్ట్రమంతా అమలు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. మరోవైపు నీటి మీటర్ల పేరుతో కొత్తరకం భారాలు మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. విజయవాడ మధురానగర్‌లో నీటి మీటర్లను బిగించి పరిశీలన చేస్తున్నారని, దీన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. సెల్‌ఫోన్ రీఛార్జ్ లాగా నీటిని కూడా డిజిటల్ మీటర్ల ద్వారా వసూలు చేస్తే ఇది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం మీద తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్ల పేరుతో భారాలు మోపే విధానాలను వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీటి మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని,ఆ పోరాటాలకు పట్టణ ప్రజానీకం కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు తెలుగు విజయ్,తారకరామనగర్ పార్టీ శాఖ కార్యదర్శి అక్బర్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్

మైనార్టీలకు స్కాలర్ షిప్ రద్దు దారుణం : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు ఇస్తున్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్కాలర్షిప్‌ను రద్దు చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ స్టేట్ మైనార్టీ కార్యదర్శి శంసుల్ హక్ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ముస్లింల మీద అక్కస్సుతో ఉదేశపూర్వకంగా స్కాలర్ షిప్‌ను తీసేయడం జరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాలను మోసం చేసిందన్నా రు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని తద్వారా బిజెపి ప్రభుత్వం ఏదైతే రద్దు చేశారో , కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని దీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : బిసి ఇందిరా రెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వల్లంపాడు గ్రామానికి చెందిన గార్లపాటి రమణారెడ్డి గారి కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వల్లంపాడు గ్రామ ఉపసర్పంచ్ జగదీశ్వర రెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న బిసి ఇందిరా

పారిశుధ్య కార్మికులకు క్రిస్మస్ కానుక పంపిణీ

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు క్రిస్మస్ కానుక పంపిణీ చేసినట్లు సర్పంచ్ ఎల్ సాలమ్మ చంద్ర, ఉప సర్పంచ్ బసాపురం ఇంతియాజ్ పేర్కొన్నారు. ఆహార పదార్థాలు, సబ్బులు, చెప్పులు, మహిళా కార్మికులకు చీరలు, తదితర కిట్లను వైసిపి సీనియర్ నాయకులు బసాపురం అబ్దుల్ సలాం, ఈఓపిఆర్‌డి సాల్మన్ రాజ్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఇంతియాజ్ మాట్లాడుతూ శిరివెళ్ల మేజర్ పంచాయతీ ప్రజల ఆరోగ్య సంరక్షణ నిమిత్తం పారిశుధ్యం పనులు చేస్తూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి కృషి చేస్తున్న నేపథ్యంలో పేదలు పండుగ నాడు పస్తులు ఉండకుండా ఇంటిల్లిపాది సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న సదుద్దేశంతో క్రిస్మస్ కానుక పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ నవీన్ రెడ్డి, బిల్ కలెక్టర్లు అన్వర్, గిరి, సిపి ఆపరేటర్ నయూం, శానిటరీ మేస్త్రి రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ కిట్టును అందజేస్తున్న దృశ్యం

సేవ చేయడమే ఇన్నర్ వీల్ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి - డోన్

సమాజంలో ప్రజలకు సేవ చేయడమే ఇన్నర్ వీల్ క్లబ్ లక్ష్యం అని ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్.ఏ.శాంతి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బి సరోజమ్మ ఆర్థిక సౌజన్యంతో క్యాన్సర్ పేషెంట్ సునంద ట్రీట్మెంట్ కోసం నగదును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉన్న పేద ప్రజలకు ఏదో ఒక రకంగా సేవ చేయాలనే సంకల్పంతో ఇన్నర్ విల్ క్లబ్ ముందు ఉంటుందన్నారు.పట్టణంలోని తారక రామనగర్ నందు గల మర్రి చక్రపాణి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న మున్సిపల్ పార్కు నిర్వహణ భాధ్యత గురించి ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుచేశామని కమిటీ చైర్మన్‌గా రాజాసుజాత,ప్రెసిడెంట్ ఎం.శారదాదేవి,వైస్ ప్రెసిడెంట్ జె.సూర్య కుమారి, కె.పద్మజా, సెక్రటరీ ఎం.సరళ,సప్తశైల సుమిత్ర, ట్రెజరర్ ఎం.శైలజ,బి. సరోజమ్మ, హానరబుల్ అడ్వైజర్‌లు ఆలా. కృష్ణవేణమ్మ, ఎస్.అనంతలక్ష్మిలుగా వ్యవహరిస్తారని తెలిపారు. త్వరలో పార్కును ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆహ్లాదకరంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనార్వెల్ క్లబ్ సభ్యులు విమలమ్మ, పద్మ,శకుంతల, విజయమ్మ,రాధ, పద్మిని,అనురాధ,షాలిని తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్ సునంద ట్రీట్మెంట్ కు నగదును అందిస్తున్న ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు

గొప్ప సేవకుడు రావు బహదూర్ శేషారెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రావు బహదూర్ శేషారెడ్డి గొప్ప సేవకుడు అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం నాడు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు రావు బహదూర్ శేషారెడ్డి 49వ వర్ధంతి ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బేతంచెర్ల ఐటిఐ ప్రిన్సిపల్ సూరప్ప ముఖ్యఅతిథిగా విచ్చేసి హైస్కూల్ ఐటిఐ ఉపాధ్యాయులు లెక్చరర్స్ శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ హరికృష్ణ ప్రిన్సిపల్ సూరప్ప మాట్లాడారు. విద్యార్థులు శేషారెడ్డి చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల కృష్ణారెడ్డి, పుష్పాంజలి మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు..

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు దొర్నిపాడు విద్యార్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-17 పోటీలకు నియోజకవర్గంలోని దొర్నిపాడు జడ్పి పాఠ శాల నుంచి బాలుర విభాగంలో మహమ్మద్ ఆఫ్తబ్, బాలికల విభాగం నుండి కౌసర్‌లు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వీరు ఈనెల 17వ తేదీన తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్తాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్తులను ప్రధానోపాధ్యాయులు బాషాతో పాటు జడ్పీటీసీ శకుంతలరెడ్డి, ఎంపిపి అమరనాథ్ రెడ్డిలు అభినందించారు.

సిఐటియు పట్టణ, మండల నూతన కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి - బేతంచర్ల

మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నందు 9వ మండల మహాసభ సందర్భంగా సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో బేతంచెర్ల పట్టణ, మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ఎన్. బాలయ్య, కార్యదర్శిగా బి. సంజీవ నాయుడు, ఆఫీస్ బేరర్స్‌గా హరి ప్రసాద్, ఎస్ కే బాష, ఎస్. మదన్, షావలి ఎస్ కాసిం వలి, కే రాజబాబు, వైబి వెంకటేశ్వర్లు, వై ఎల్లయ్య, నాగేంద్రమ్మ, గుల్జార్ బీ, జై బాలరాజు రుక్మిణి దేవి ఎన్నుకున్నారు. 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షునిగా ఎన్ వెంకట రమణ, కార్యదర్శులు ఎస్ రహమతుల్లా, మండల ఆఫీస్ బేరర్స్ బి వెంకటసుబ్బయ్య, వి అంజనమ్మ, ఆర్ వెంకట్ లక్ష్మి, కే రాముడు, ఎం తిమ్మయ్య, మల్లికార్జున, నాగలక్ష్మిని, 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన సిఐటియు పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సిఐటియు బలోపేతానికి కృషి చేస్తామని వారన్నారు. స్థానిక సమస్యలపై కార్మికులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేసి పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమ పోరాటాలు చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ సాదిక్ హుస్సేన్, ఎస్ ఏ కలాం, వెంకటేశ్వర్లు, పెద్దన్న, వెంకటరమణ, భాస్కర్, రాముడు, మధు, పద్మావతి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, మేరీ, పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో విజిలెన్స్ సిఐ నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించి, గోడౌన్లలో దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పడకండ్లకు వెళ్లే రహదారి సమీపంలో ఒక గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలించి సీజ్ చేశారు. అలాగే పట్టణంలో మరొక ప్రదేశంలో రహస్యంగా నిల్వ ఉంచిన బియ్యం ప్యాకెట్లను గుర్తించి వాటిని కూడా సీజ్ చేశారు. దాదాపు ఎనిమిది వందలకు పైగా బియ్యం ప్యాకెట్లు అధికారుల దాడుల్లో పట్టుబడడం జరిగింది. సమాచారాన్ని తహసిల్దార్ కు తెలియజేయగా ఆయన వెంటనే సివిల్ సప్లై డిప్యూటీ తాహాసిల్దారును విజిలెన్స్ అధికారుల వద్దకు పంపడం జరిగింది. పంచనామా నిర్వహించిన అనంతరం పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని సిఎస్డిటి శేఖర్ రెడ్డి కి అప్పగించారు. ఈ రేషన్ బియ్యాన్ని రుద్రవరం ప్రభుత్వ గోదాంకు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్సై తిమ్మయ్య ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు స్థానిక ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. రోగుల పట్ల దయా హృదయం కలిగి ఉండాలన్నారు. సమస్యలు వుంటే తన దృష్టికి తెస్తే వాటిని సంబంధిత అధికారులు తో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హుస్సేన్ బీ, వైసిపి నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి,మేకల సుబ్బారాయుడు, కృష్ణా రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి సబ్బిందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం : టిడిపి

ప్రజాశక్తి - పాములపాడు

వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని ఆ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంటేపోగు జయాకర్ అన్నారు. బుధవారం ఆయన టిడిపి పాములపాడు మండల కన్వీనర్ హరినాథ్ రెడ్డిని కలిశారు. మండలంలోని విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలోని అవినీతి, అక్రమాలపై ప్రజల్లోకి తీసుకెళ్లి, అధికార పార్టీ చేస్తున్న అన్యాయాలను వివరించి ప్రజలను చైతన్యవంతులను చేసి, రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రశేఖర్, గోవిందు, శివశంకర్ స్వామి, కరీముల్లా బేగ్, మహబూబ్ బేగ్, అలీభాష, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు